క్లుప్తంగా

గిరిజ ప్రియదర్శిని మృతి న్యాయవ్యవస్థకు తీరనిలోటు

జనగామ రూరల్ : జస్టిస్ ఎం.గిరిజ ప్రియదర్శిని మృతి న్యాయవ్యవస్థకు తీరని లోటని చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ మంచాల రవీందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైకోర్టు జస్టిస్‌గా బాధ్యతలు నిర్వహించారని, గతంలో జనగామ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి, పోర్ట్ పోలియో జడ్జిగా పనిచేసిన గిరిజ ప్రియదర్శినికి జనగామతో గొప్ప అనుబంధం ఉందని అన్నారు. ఆమె మృతికి జనగామ న్యాయవాదులు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

నేడు చెక్కుల పంపిణీ

స్టేషన్‌ఘన్‌పూర్ : నియోజక వర్గంలోని ఏడు మండలాలకు చెందిన లబ్ధిదారులకు నేడు స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

వావిలాలలో పశు వైద్యశిబిరం

పాలకుర్తి : పాలకుర్తి మండలంలోని వావిలాల గ్రామంలో నేడు ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని చెన్నూరు గ్రామ పశు వైద్యాధికారి తెలిపారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాల కార్యక్రమం ఉంటుందని అన్నారు. రైతులు తమ పశువులను టీకా వేయించాలని కోరారు.

కాంగ్రెస్ సన్నాహక సమావేశం

పాలకుర్తి : కాంగ్రెస్ పార్టీ నిర్మాణ సన్నాహక సమావేశం నేడు పాలకుర్తిలో నిర్వహించనున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ బృందావన్ గార్డెన్‌లో నిర్వహిస్తున్న సమావేశానికి ఎమ్మెల్యే యశస్విని రెడ్డితో పాటు ముఖ్య అతిథులుగా జనగామ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, భరత్ చందర్ రెడ్డి, వరంగల్ జిల్లా అబ్జర్వర్స్ అమర్ అలీఖాన్, మేడిరవి చంద్ర, జనగామ జిల్లా అబ్జర్వర్ అద్దంకి దయాకర్, బైకిని లింగం, మహబూబాబాద్ జిల్లా అబ్జర్వర్స్ పాల్గొంటారని ఝాన్సీరెడ్డి తెలిపారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

లింగాలఘణపురం : మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని స్వచ్ఛంద సేవకుడు ప్యాట రవి కోరారు. ఆదివారం మండల కేంద్రంలో మాదక ద్రవ్యాలను నిర్మూలించాలని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అవగాహన కలిగి ఇలాంటి చెడు అల వాట్లకు బానిసలు కావొద్దని కోరారు. ర్యాలీలో రాగల్ల ఉపేందర్, మల్ల శ్రీశైలం, వీరయ్య, మల్లేశం, రామచందర్, వెంకటేశ్, మల్లేశం, భాగ్యలక్ష్మి, యాకయ్య తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి


రాజమణి (ఫైల్)

తరిగొప్పుల : అనారోగ్యంతో పాటు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతిచెందిన సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన కథనం ప్రకారం.. మండలంలోని అబ్దుల్ నాగారం గ్రామానికి చెందిన పండుగ రాజమణి (41) కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. దీంతో భర్త కనుకయ్య పలు ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకు వెళ్లి చికిత్స అందిస్తున్నాడు. ఈ క్రమంలో చికిత్స పొందుతున్న కడుపు నొప్పి నయంకాకపోవడం, చికిత్స నిమిత్తం అప్పులు అవుతుండడంతో తీవ్ర మనోవేదనకు గురై శనివారం ఇంటివద్ద క్రిమిసంహారక మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా రాజమణి ఆదివారం మృతి చెందింది.

జర్నలిజంతో విస్తృత అవకాశాలు

కేయూ క్యాంపస్: జర్నలిజం కోర్సు పూర్తిచేసిన వారికి మీడియాలో విస్తృత అవకాశాలున్నాయని కాకతీయ యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ సురేష్‌లాల్ అన్నారు. దూరవిద్యా కేంద్రంలో 2022 – 2024లో జర్నలిజం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధునిక సమాజంలో ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియాతోపాటు సామాజిక మాధ్యమాల విస్తృతి కారణంగా ప్రపంచంలో ఏ సంఘటన జరిగినా క్షణాల్లో సమాజంలో అన్ని వర్గాలకు సమాచారం అందుతోందన్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రజా సంబంధాల అధికారి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ స్టాఫ్ ట్రైనింగ్ డైరెక్టర్ డాక్టర్ వెంకటరమణ, జర్నలిజం విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ సంగని మల్లేశ్వర్, అధ్యాపకులు నర్సింహరాములు, వెంకటేశ్వర్లు, సురేందర్, చిరంజీవి పాల్గొన్నారు.

ప్రయాణం నరకప్రాయం


ధ్వంసమైన గంగాపూర్-నాగిరెడ్డిపల్లి రోడ్డు


కంకర తేలిన బీటీ రోడ్డు

గుంతలమయంగా గంగాపూర్-నాగిరెడ్డిపల్లి రోడ్డు

- పట్టించుకోని అధికారులు, పాలకులు

బచ్చన్నపేట : మండలంలోని ఆలింపూర్ గ్రామ మలుపు నుంచి పడమటికేశ్వాపూర్ శివారు గ్రామమైన హనుమాన్‌పేట మలుపు వరకు తొమ్మిది కిలోమీటర్ల బీటీ రోడ్డుపై ప్రయాణం అంటేనే ప్రయాణికులు, స్థానికులు నరకం అనుభవిస్తున్నారు. రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడి కంకర తేలి రోడ్డుపై ప్రయాణం చేయాలంటే వాహనదారులు భయాందోళనకు గురువుతున్నారు. ఈ రోడ్డు గుండా గంగాపూర్, ఇటుకాలపల్లి, రామచంద్రాపూర్, నాగిరెడ్డిపల్లి, పడమటికేశ్వాపూర్, హనుమాన్‌పేట, పూలపేట, జెయాల, నాగపురి గ్రామాలకు అలాగే కొండ పోచమ్మ తల్లి వద్దకు వాహనాల్లో వెళ్తుంటారు. రోడ్డంతా గుంతల మయంగా మారడంతో ఆయా గ్రామాలకు వెళ్లే ఆర్టీసీ బస్సు కూడా రావడం లేదు. దీంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. గ్రామంలో ఏమైనా ఆపద వస్తే అటువైపు ప్రైవేటు వాహనాలు కూడా రావడం లేదు. రోడ్డుపై ప్రయాణం చేసే వారికి ఎదురుగా వాహనం వస్తే కంకర తేలిన రాళ్లు ఎక్కడ ఎగిరి పడుతాయో అని భయంతో ప్రయాణిస్తున్నారు. ఉదయాన్నే రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. భారీ గుంతలతో పలువురు వాహనదారులు ప్రమాదవశాత్తు ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. కంకర తగిలి పలు వాహనాలు రిపేర్‌కు వస్తున్నాయి. చిన్నపాటి వర్షాలకు ఆయా గుంతల్లో నీరు నిలిచి గుంతలు కనబడక అందులో వాహనదారులు పడిపోతున్నారు. రాత్రి వేళ అటువైపు ప్రయాణం చేయాలంటే వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు,ప్రయాణికులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



ఆలింపూర్ క్రాస్ నుంచి ఉన్న బీటీ రోడ్డుపై గుంతలమయంగా మారి కంకర తేలడంతో ప్రయాణికులు నరక అనుభవిస్తున్నారు. భారీ గుంతల్లో వాహనాలు అదుపు తప్పి ప్రమాదవశాత్తు కింద పడిపోతున్నారు. వ్యవసాయ బావుల వద్దకు వెళ్దామన్నా ఆ రోడ్డుపై ప్రయాణం చాలా ఇబ్బందిగా మారుతోంది.

– బందారం వినయ్‌కుమార్, గంగాపూర్

ఆపద వస్తే అంతే..



నాగిరెడ్డిపల్లి గ్రామంలో ఎవరికైనా ఆపద వస్తే ప్రైవేట్ వాహనాలు రావాలన్నా ఇబ్బంది పడుతున్నారు. కొన్ని గ్రామం వెళ్దామంటే మట్టి రోడ్డు, మెయిన్ రోడ్డు రావాలంటే గుంతలమయంగా ఉండడంతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళ ప్రయాణం అంటేనే భయపడుతున్నాం. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని రోడ్డును మరమ్మతు చేయాలి.

– బంగారు మహేష్, నాగిరెడ్డిపల్లి

‘అందాల పోటీలు రద్దు చేయాలి’


జనగామ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న ఐద్వా సభ్యులు

జనగామ రూరల్ : మహిళల ఆత్మగౌరవాన్ని కించపరిచే అందాల పోటీలను రద్దు చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఐద్వా కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించనున 72వ ప్రపంచ అందాల పోటీలను రద్దు చేయాలని నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలకు దిక్కు లేదు గానీ.. అందాల పోటీలకు కోట్ల రూపాయలు వెచ్చించడం ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ మహిళలకు ఎంత మాత్రం ఉపయోగపడని ఈ అందాల పోటీలను కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. అందాల పోటీలు కాదు ఆసరా పింఛన్లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మోకు భవాని, పందిళ్ల కళ్యాణి, కొండ వరలక్ష్మి, చింతల శ్రీలత, బాలమణి, దూసరి నాగమణి, సంపత్ విజయ, పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వసతులు కరువు

జఫర్‌గఢ్ : పని ప్రదేశంలో కనీస వసతులు లేక ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మహాజన ప్రజా పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జెట్టి రవికుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ..జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వేసవిలో పని చేసే కూలీలకు వసతులు కల్పించేందుకు ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. వేసవిలో ఉపాధి పనులు చేసే కూలీలకు నీడ, తాగునీటి వసతితో పాటు మెడికల్ కిట్లు వంటి సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. దీంతో మండుటెండలో ఉపాధి పనులు చేసే కూలీలు అవస్థలు పడడంతో పాటు అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా కూలీలకు కనీస వసతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వే


సర్వే చేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు తదితరులు

రఘునాథపల్లి : మండలంలోని ఫతేషాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపునకు ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు ఆదివారం సర్వే చేపట్టారు. జాబితాలో ఉన్న వారికి ఇళ్లు లేకుండా ఉన్నారా..? వారు అర్హులా కాదా అని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపునకు సర్వే చేపట్టినట్లు పేర్కొన్నారు. గ్రామంలో 22 మందిని సర్వే చేయగా వారిలో ఒకరు అనర్హులుగా తేలిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ప్రభుత్వం మొదట నిరుపేదలకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. మండల వ్యాప్తంగా లబ్ధిదారుల గుర్తింపు సర్వే కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి మహేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి


కంఠమహేశ్వర స్వామి ఉత్సవాల్లో పాల్గొన్న ఝాన్సీరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు

కొడకండ్ల : గ్రామ దేవతల ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని పాలకుర్తి నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి కోరారు. ఆదివారం మండలకేంద్రంలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన కంఠమహేశ్వరస్వామి ఉత్సవాల్లో ఆమె పాల్గొని పూజలు చేశారు. అనంతరం చెరువుముందు తండాలో ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనలో ఆమె పాల్గొని పూజలు చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేష్‌నాయక్, నాగరాజు, హరగోపాల్‌గౌడ్, శ్రీశైలం, సతీష్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

కొడకండ్ల మండలంలోని చెరువుముందు తండాలో ఆదివారం నిర్వహించిన ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొన్నారు. అనంతరం దయాకర్‌రావు ప్రత్యేక పూజలు చేసి ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిందె రామోజీ, అభిమన్ గాంధీ, వెంకటేశ్వర్‌రావు, ప్రేమ్‌కుమార్, తుకారాంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ఒకేషనల్ కోర్సు

లింగాలఘణపురం : మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో (కేజీబీవీ) ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ ఒకేషనల్ ఎంఎల్‌టీ కోర్సులో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని స్పెషల్ ఆఫీసర్ అన్నపూర్ణ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని అదే విధంగా ఆరో తరగతిలో 40 సీట్లు, 7వ తరగతిలో 10 సీట్లు ఖాళీగా ఉన్నాయని దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పూర్తి వివరాలకు 81799 85886 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రవీణ్‌కు గద్దర్ ఐకాన్ అవార్డు



కొడకండ్ల : గద్దర్ ఐకాన్–2025 అవార్డును మండల కేంద్రానికి చెందిన గాయకుడు జవ్వాజి ప్రవీణ్‌కుమార్ అందుకున్నాడు. సాయి అలేఖ్య సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో పనిచేసిన కళాకారులను ఎంపిక చేసి సన్మానించగా అందులో ప్రవీణ్‌కుమార్ ఎంపికయ్యాడు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రవీణ్‌కుమార్‌కు అవార్డును అందజేశారు.

అసంఘటిత రంగ కార్మికులు ఏకం కావాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రాజు తదితరులు

బచ్చన్నపేట : కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా అసంఘటిత రంగ కార్మికులు ఏకం కావాలని సీఐటీయూ మండల కన్వీనర్ అన్నెబోయిన రాజు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఈ నెల 20వ తేదీన దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 49 రకాల కార్మిక చట్టాలను తుంగలో తొక్కి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చి కార్మికుల హక్కులను హరిస్తోందన్నారు. దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు ఎర్ర కనుకయ్య, బావండ్లపల్లి పెంటయ్య, కొమురయ్య, కిష్టయ్య, సిద్దిరాములు, రాములు, నర్సింహులు పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి ఆలయ కమిటీ ఎన్నిక


బుచ్చి కొమురయ్య, చైర్మన్

చిల్పూరు : చిన్నపెండ్యాల గ్రామంలోని మల్లంకుంట్ల శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ చైర్మన్‌గా రామడుగు బుచ్చి కొమురయ్యను దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు చిల్పూరు ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఏళ్ల చరిత్ర ఉన్న ఆలయాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధి చేస్తానని అన్నారు. ధర్మకర్తలుగా తాళ్లపల్లి శివకుమార్, భూక్య తిరుపతి, కొత్తపల్లి యాకరాజు, భీమగోని అనితమొగిళి ఎన్నికయ్యారు,. ఈనెల 7న ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు చైర్మన్ కొమురయ్య తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేష్, నాయకులు లింగారెడ్డి, దామోదర్, తాళ్లపల్లి బుచ్చయ్య, ఉమాసమ్మయ్య, సంపత్, యాదగిరి, రాజ్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రొబేషనరీ ఎస్సైగా రాజేందర్



దేవరుప్పుల : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ప్రొబేషనరీ ఎస్సైగా జిల్లా రాజేందర్ ఆదివారం విధుల్లో చేరారు. ఇటీవల ఎస్సైగా శిక్షణ పూర్తి చేసుకున్న బ్యాచ్‌కు ఆయా స్టేషన్లను కేటాయించారు.

ఘనంగా ఆదిశంకరాచార్య జయంతి


వేడుకలో పాల్గొన్న భజన మండలి సభ్యులు

జనగామ రూరల్ : జగద్గురువు ఆదిశంకరాచార్య జయంతి వేడుకలను ఆదివారం భద్రాచలంలో శ్రీరామదాసు భజన మండలి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అంబసత్రం ధర్మాధికారి నేంద్రుగంటి కృష్ణమోహన్, ప్రధాన వేద పండితులు శశికాంత్ శర్మ,మూర్తి, మల్లేష్, లక్ష్మయ్య, వేముల గంగారం, భిక్షపతి, శ్రీకాంత్, మలిపెద్ది నర్సయ్య, మహిళలు భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలి


క్రీడాకారులతో బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు

జఫర్‌గఢ్ : క్రమశిక్షణతో పాటు కఠోర శ్రమ చేసి ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలని బాల్‌బాడ్మింటన్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు గాదెపాక అయోధ్య కోరారు. ఈ మేరకు మండలంలోని కూనూర్ ఉన్నత పాఠశాలలో బాల్ బ్యాడ్మింటన్ రెండో రోజు శిక్షణ శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని అయోధ్య సందర్శించారు. అనంతరం జాతీయ క్రీడాకారుడు రమేష్ బాల్ బ్యాడ్మింటన్ ఆట తీరుపై క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో క్యాంప్ కోచ్ ముచ్చ సుధాకర్, అసోసియేషన్ సభ్యులు ప్రభాకర్, సంపత్, కాటం రాజిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ ఆకుల సాయికుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పాలకుర్తి టౌన్: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, గురువులు


రఘునాథపల్లి: నిడిగొండలో 2004-05 బ్యాచ్ విద్యార్థులు

పాలకుర్తి టౌన్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2004–05 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాటి గురువులను, సహచర విద్యార్థుల మృతులకు సంతాప సూచకంగా, పహల్గాం ఉగ్రదాడిలో మృతులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. రెండు దశాబ్దాల తర్వాత కలిసిన సహచరులు ఆత్మీయతతో ఆలింగనం చేసుకున్నారు. నాటి గురువులు కిషన్‌రావు, మహేందర్‌రెడ్డి, సంధ్యారాణి, దొంగరి సోమయ్య, రాధలక్ష్మి, వెంకటేశ్వరరావు, రాజేంద్రప్రసాద్, సలేంద్ర సోమయ్య, మహేందర్, బాలమల్లు, నారబోయిన యాకయ్యలను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. పూర్వ విద్యార్థులు రాపాక అనిల్,జీడి నరేందర్, గాదెపాక కిరణ్, సంగి నరేష్, గజేందర్, ముస్కు నిషంత్, దివ్య, సరిత, స్వప్న, కోమల, సుప్రియ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

నిడిగొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

రఘునాథపల్లి : మండలంలోని నిడిగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2004–05 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు పలకరించుకొని పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. తమను విద్యా విద్యావంతులుగా తీర్చిదిద్దిన గురువులు ఖాజామొహినుద్దీన్, సత్యలక్ష్మి, కిష్టయ్య, కరీముల్లా, వెంకన్న, నర్సింహారెడ్డి, జహీర్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న స్నేహితులను ఆదుకోవడంతో పాటు, పాఠశాల అభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆనంద్‌కుమార్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌ఈఏసీ సభ్యుడికి సత్కారం


యాదగిరిని సత్కరిస్తున్న గ్రామస్తులు


సాధిక్‌ను సన్మానిస్తున్న మసీద్ కమిటీ నాయకులు

రఘునాథపల్లి : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్‌ఈఏసీ) మధ్య తెలంగాణ మండలి సలహా సభ్యుడిగా ఇటీవల నియమితులైన మండలంలోని కన్నాయపల్లి గ్రామానికి చెందిన మంతపురి యాదగిరిని ఆదివారం గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. శ్రీరామయువజన సంఘం, గ్రామస్తులు, మహిళా సంఘాలు యాదగిరిని శాలువాలతో సత్కరించి అభినందించారు. యువజన సంఘం అధ్యక్షుడు కె.శశిధర్, కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, వేణురెడ్డి, గాలిరెడ్డి, సోమిరెడ్డి, కుమార్, యాదగిరి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పదో తరగతి టాపర్‌కు సన్మానం

కొడకండ్ల : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి టాపర్‌గా నిలిచిన గులాం సాధిక్‌ను ఆదివారం స్థానిక మసీదులో జమా కమిటీ నాయకులు సన్మానించారు. పట్టుదలతో చదివి 568 మార్కులతో టాపర్‌గా నిలవడం అభినందనీయమని కమ్యూనిటీ అధ్యక్షుడు మహ్మద్ హనీఫ్ అన్నారు. కార్యక్రమంలో నాయకులు సలీం, హమీద్, సర్వర్, రంజాన్, అజార్, అబ్బాస్ అలీ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బొడ్రాయికి జలాభిషేకం


బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న మహిళలు

రఘునాథపల్లి : మండల కేంద్రంలో విజయ దుర్గాదేవి, రేణుక ఎల్లమ్మ తల్లి ఉత్సవాల ప్రారంభంలో భాగంగా ఆదివారం మహిళలు భక్తిశ్రద్ధలతో బొడ్రాయికి జలాభిషేకం చేశారు. ప్రతీ ఇంటి నుంచి నీళ్ల బిందెలతో బొడ్రాయి వద్దకు వెళ్లి జలాభిషేకం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ దేవతల ఉత్సవాల సందర్భంగా అధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ నెల 8వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.